క్లుప్తంగా

పాఠశాలకు ఇన్వెర్టర్ అందజేత



ఇన్వెర్టరు అందజేస్తున్న వార్డు సభ్యుడు శ్రీను

లావేరు: మురపాక గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు మజ్జి శ్రీను తన సొంత నిధులతో మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్సియల్ స్కూల్‌కు ఇన్వెర్టర్‌ను సమకూర్చారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్కూల్ పీఎంసీ చైర్మన్, మురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తేనేల సురేష్‌కుమార్ దృష్టికి తల్లిదండ్రులు దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థి తండ్రి అయిన వార్డు మెంబరు శ్రీను స్పందించి రూ. 18 వేల విలువ గల ఇన్వెర్టరును కొనుగోలు చేసి పాఠశాల ప్రిన్సిపాల్ బొత్స ప్రసాద్‌కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తేనేల సురేష్‌కుమార్, ఏపీజీబీవీ మాజీ ఉద్యోగి గొర్లె వెంకటరమణ, పేరూరి కామేశ్వర రావు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ సూచించారు. జి.సిగడాంలోని మోడల్ పాఠశాలలోని ఉపాధ్యాయులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడా రంగాల్లో రాణించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పాఠశాల సిబ్బంది వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, పిచ్చిక నేతాజీ, జి.సిగడాం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శీర రాము, రామకృష్ణ ఉన్నారు.

అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో 129 సబ్ డివిజన్ పరిధి సర్వేనంబర్ 126/1లో వేసిన అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో తహసీల్దార్ వై.సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కూడా ఫిర్యాదు చేసినట్లు చిరంజీవి తెలిపారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, నేతింటి సత్యనారాయణ ఉన్నారు.

బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఇవ్వనున్న 30 రోజులు బ్యూటీషియన్ కోర్సుకు మహిళా అభ్యర్థులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్హత, 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు దరకాస్తు చేసుకోవడానికి అర్హులు. పూర్తి వివరాలకు 95534 10809, 79933 40407 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నగర కళింగవైశ్య అధ్యక్షుడిగా నాగరాజు



నాగరాజును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర కళింగవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఉన్న నాగరాజును రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాకుళం నగరంలో కళింగ వైశ్యభవన్‌లో సోమవారం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోరాడ రమేష్, సెక్రటరీగా వైశ్యరాజు మోహన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ కళింగకోమట్ల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇప్పటికే నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తమ సంఘ లక్ష్యమన్నారు.

వీరులారా మీకు వందనం

దేశం కోసం విశేష సేవలందించి జీవితాలను త్యాగం చేసిన వీరుల సేవలు వెలకట్టలేనివని వక్తలు అన్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరంలో అమరులైన వారిని స్మరించుకున్నారు. స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబీకులు, సైనిక ఉద్యోగులను సత్కరించి గౌరవించారు. ప్రత్యేక శిలాఫలకాలను ఆవిష్కరించారు. మట్టిని పట్టుకుని ప్రతిజ్ఞ చేశారు. మొక్కలను విరివిగా నాటారు.



శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు



ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



రణస్థలం: దేరసాంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సాయికుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు



ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరంలో నా భూమి-నాదేశం కార్యక్రమం



గార: శ్రీకూర్మంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొండు రఘురామ్, నాయకులు



లావేరు: హనుమంతుపురంలో నేలతల్లికి పూజలు చేస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు, నాయకులు

అనాథని అక్కున చేర్చుకుని..

శ్రీకాకుళం క్రైమ్: అతనికి ఎండ, వాన, చలి తీవ్రత ఏమీ చేయదు.. రోడ్డు మీదే తిరుగుతూ.. ఏది దొరికితే అది తింటూ.. గత 15 ఏళ్లుగా డేఅండ్ నైట్ కూడలి సమీపంలోనే అనాథగా జీవిస్తున్నాడు. సోమవారం పెరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించి అటుగా వస్తున్న జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అతన్ని చూశారు. వెంటనే రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగిరెడ్డి లక్ష్మణరావును ఆ వ్యక్తిని స్వచ్ఛంద సేవా సంస్థకు తరలించాలని ఆదేశించారు. ఎస్‌ఐ దగ్గరుండి అనాథకు స్నానం చేయించి.. దుస్తులు వేయించి కలెక్టరేట్ సమీపంలోని మదర్ థెరీసా స్వచ్ఛంద సేవా సంస్థలో చేర్పించారు. దీనిపై ఎస్‌ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ రాయగడలోని కంద్రవీధికి చెందిన హరికృష్ణ బెహరా అనే వృద్ధుడు గత 15 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాడన్నారు. ఎవరైనా ఏదైనా ఇస్తే తప్ప.. అడిగి తీసుకోడని, సత్యసాయి సేవా సమితి వారు ఒకపూట భోజనం పంపిస్తుంటారని చెప్పారు.



దే అండ్ నైట్ కూడలి వద్ద అనాథ వృద్ధుడితో మాట్లాడుతున్న ఎస్‌ఐ



దుస్తులు వేయించి అనాథ ఆశ్రమానికి తీసుకెళ్తూ..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ సత్యనారాణ సాహు అన్నారు.

ఎల్ఐసీ సెంట్రల్ ఆఫీస్ ఆదేశాల మేరకు ఈఎస్‌జీ ఇనీషియేటివ్స్‌లో భాగంగా శ్రీకాకుళంలోని ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

యోగాలో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) విద్యార్థులు శ్రీకాకుళం పట్టణంలో సోమవారం నిర్వహించిన నేషనల్ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటారు. 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు పురుషుల విభాగంలో పీయూసీ రెండో ఏడాది విద్యార్థి భరత్ బంగారు పతకం, ఇంజినీరింగ్ విద్యార్థి గణేష్ వెండి పతకం, ఇంజినీరింగ్ విద్యార్థి విజయ్ వెండి పతకం, ఇంజినీరింగ్ విద్యార్థి నవీన్ కాంస్య పతకం, ఇంజినీరింగ్ విద్యార్థి విజయ్ వెండి పతకం సాధించారు. మహిళల విభాగంలో ఇంజినీరింగ్ విద్యార్థిని రజిత బంగారు పతకం, ఇంజినీరింగ్ విద్యార్థిని నళిని వెండి పతకం సాధించారు. విజేతలకు ఎస్ఎం పురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, యోగా విభాగ అధిపతి డాక్టర్ ఈశ్వరరావు అభినందించారు.



యోగాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ జగదీశ్వరరావు, అధికారులు.

'ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలి'

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అధికారి శివరామకృష్ణకు విన్నవించారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలో డీటీఓ శివరామకృష్ణకు ఆర్టీసీ అధికారులు మర్యాదపూర్వకంగా కలసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్ క్యారేజీలుగా పర్మిట్లు తీసుకుని స్టేజ్ క్యారేజీలుగా నడుపుతూ నిబంధనలను ఉల్లంఘించి ప్రయాణికులను ఎక్కించుకుపోతున్నారన్నారు. తద్వారా ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కలెక్టర్‌కు కూడా విన్నవించామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు కె.మాధవ్, కెఆర్ఎస్ శర్మ, శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, టీఐ–3 ఎల్.ఎస్.నాయుడు, ఎస్‌వి రమణ, ఇతర అధికారులు ఉన్నారు.



డీటీవో శివరామకృష్ణకు వినతి ఇస్తున్న ఆర్టీసీ అధికారులు

బహుమతులు అందజేత

లావేరు: బెంగళూరుకు చెందిన ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో వైసీబీ ఆధ్వర్యంలో స్కూల్ రెడీనెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్లు, కాలేజీ, ఎంపీయూపీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం జరిగే స్వాతంత్య్ర వేడుకల్లో బహుమతులు అందజేయడం కోసం సోమవారం ఇండియా లిటరసీ ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్ రత్నాల కల్పన పాఠశాలలకు వెళ్లి హెచ్ఎంలకు బహుమతులు అందజేశారు.



మెట్టవలసలో హెచ్ఎం సత్యన్నారాయణకు బహుమతులు అందజేస్తున్న కల్పన

ఐదు వార్డు మెంబర్ల స్థానాలు ఏకగ్రీవం

గార: మండలంలోని ఐదు పంచాయతీ వార్డు మెంబర్ల స్థానాలు ఏకగ్రీవమయ్యాయని మండల అభివృద్ధి అధికారి సంజీవి రమణయ్య సోమవారం తెలిపారు. బలరాంపురం, కె.మత్స్యలేశంలో రెండు దరఖాస్తులు రాగా, ఒక్కొక్క దరఖాస్తు విత్‌డ్రాలు జరిగాయి. దీంతో ఒక్కో దరఖాస్తు మాత్రమే బరిలో నిలిచాయి. కొమరవానిపేట నుంచి బర్రి నీరేఖరి, అంబళ్లవలస నుంచి జన్నాడ రమణమ్మ, కె.సైరిగాం నుంచి ఆరంగి ఉషారాణి, కె.మత్స్యలేశం నుంచి దాసరి కాంతమ్మ, బలరాంపురం నుంచి వాసుపల్లి యల్లాయమ్మలు నామినేషన్లు వేయగా.. వారు ఏకగ్రీవంగా ఎన్నికనట్టు సంబంధిత అధికారులు ధ్రువపత్రాలను అందజేశారు.

వార్డు సభ్యుడు ఎన్నిక ఏకగ్రీవం

జి.సిగడాం: దవళపేట గ్రామ పంచాయతీ మూడో వార్డు సభ్యుడుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కంచరాన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఎన్నికల రిట్నరింగ్ అధికారి అరసాడ రవి సోమవారం తెలిపారు. ఈనెల 9న వార్డు సభ్యుని పదవి కోసం శ్రీనివాసరావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. పరిశీలించిన అనంతరం ఏకగ్రీవంగా ఆయన ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ పేడాడ శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, నాయకులు కంచరాన రమణారావు, బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, సూరన్నాయుడు. పంచాయతీ కార్యదర్శి స్వాతి ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: అజ్జరాం ఒకటో వార్డు సభ్యురాలుగా బోర సూర్యకుమారి ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ సిబ్బంది ఆమెకు సోమవారం ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఒకే నామినేషన్ రావటంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. సూర్యకుమారిని సర్పంచ్ శ్రవంతి, ఎంపీటీసీ సభ్యుడు గోవింద అభినందించారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘనంగా నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రణస్థలం: ప్రజా గాయకుడిగా గద్దర్ అనేక పోరాటాలు చేసి సమాజానికి ఎంతో సేవలు అందించారని ఏపీ దళిత మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు కుప్పిలి రాముడు అన్నారు. మండల కేంద్రంలోని షాదీఖానా ఆవరణలో ఏపీ దళిత మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.బెంజిమెన్ ఆదేశాల మేరకు రణస్థలం మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

మండల శాఖ నూతన అధ్యక్షుడుగా పల్ల నీలయ్య, గౌరవ అధ్యక్షుడుగా సాకేటి పోతయ్య, ప్రధాన కార్యదర్శిగా కుప్పిలి పైడిరాజు, ఉపాధ్యక్షులుగా బంకపల్లి అప్పారావు, బోనెల పరశురాం, పల్ల అప్పన్న, గాడి రాజు, మామిడి జగదీశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా సమాధుల శ్రీను, ఎండ తౌడు, నేతల పెంటయ్య, తోలాపి సూరిబాబు, యామల గోపాల్, కోశాధికారిగా టి.సూరప్పడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దుక్క అదినారాయణ, ప్రధాన సలహాదారులుగా గేదెల సురేష్, జి. రామారావు, సోషల్ మీడియా ప్రతినిధిగా ముక్కు రాములు ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గంలోకి కుప్పిలి సీతప్పడు, దుంగ సూర్యనారాయణ, దత్తు గోవిందలను నామినేట్ చేశారు.

పార్టీ కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగరంలో దీపామహల్ ఎదురుగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయం 9గంటలకు స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండేవారికి ఆటల పోటీలతో ఉపశమనం కలుగుతుందని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి నిర్వహించిన ఆటల పోటీల్లో భాగంగా సోమవారం కబడ్డీ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో గేదెల వాసుదేవరావు జట్టు, కె.ప్రతాప్ చంద్ర జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్ని సూర్యారావు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుఢ్యాన్ని ఉపయోగపడతాయన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, షటిల్, క్యారమ్స్, కబడ్డీ పోటీలు సోమవారంతో ముగిశాయన్నారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు సనపల హరి, కూన అన్నంనాయుడు, ఖగేంద్రనాథ్, అన్నెపు భువనేశ్వర్, కూన రాజారావు, ఎ.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పొన్నాడ రాము, భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

శ్రీకాకుళం: ఆధునిక యుగంలో మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో వాకర్స్‌కు బీపీ, సుగర్, తదితర ఆరోగ్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందన జీవితంలో నడకకు కొంత సమయం కేటాయించాలన్నారు. జి.ఇందిరాప్రసాద్, గుప్త, రవి శంకర్, పట్నాయక్, జీఎస్ రావు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆధార్ సేవలు

జి.సిగడాం: మండల కేంద్రంలోని సచివాలయంలో సోమవారం ఆధార్ సేవలను సిబ్బంది అందించారు. కార్డులో తప్పులు, చిన్నారుల బయోమెట్రిక్ అప్‌డేట్ చేశారు. పలువురు సేవలను సద్వినియోగం చేసుకున్నారు. డిజిటల్ అసిస్టెంట్ పొగిరి రాము ఉన్నారు.

సంక్షిప్తంగా..

రూ.10 వేల విరాళం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని హయాతినగరానికి చెందిన విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిల్లాన మాధవరావు ఆయన కుమార్తె డాక్టర్ సంతోషి రుప, అల్లుడు డాక్టర్ ప్రవీన్ శివకుమార్ పెళ్లి రోజు సందర్భంగా రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాన్ని అన్నపూర్ణ పథకం కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావుకు అందజేశారు. గంగుల రమణబాబు, సూర రామ చంద్రరరావు తదితరులు ఉన్నారు.

జాతీయ జెండాలు పంపిణీ



లావేరులో జెండాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

లావేరు: హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగుర వేయడం కోసం మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు ఇజ్జాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇప్పిర్తి ఆదెయ్య, ఇజ్జాడ రమణ, ఇప్పిలి నాగేశ్వరరావు, జి.గొల్ల, గంట్యాడ అప్పలనాయుడు, లక్ష్మణ, శివ పాల్గొన్నారు.

కోటేశ్వరాలయ సన్నిధిలో ట్రైనీ కలెక్టర్



స్వామివారిని దర్శించుకుంటున్న రాఘవేంద్ర మీనా

శ్రీకాకుళం కల్చరల్: ఉమారుద్రకోటేశ్వరస్వామిని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రాధాకృష్ణ, అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన పేరుతో అర్చనలు చేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి



లావేరు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన నాయని ఢిల్లీ రెడ్డి (35) చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. ఢిల్లీరెడ్డి (ఫైల్)

ఢిల్లీ రెడ్డి అప్పుల సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ నెల 12వ తేదీన ఎచ్చెర్ల మండలంలోని నవభారత్ జంక్షన్ వద్ద పురుగు మందుతాగి ఆత్మహత్య హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆదిత్యుడిని దర్శించుకున్న రిటైర్డ్ డీజీపీ



రిటైర్డ్ డీజీపీని ఆశీర్వదిస్తున్న అర్చకుడు రంజిత్ శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామిని రిటైర్డ్ డీజీపీ డాక్టర్ సి.ఎన్.గోపినాథ్‌రెడ్డి సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ ఆధ్వర్యంలో గౌరవ స్వాగతం పలికి అంతరాలయం దర్శనం చేయించారు. ఎస్‌ఐ బలివాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.